PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 12 | మంగళవారం 14, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari







రాష్ట్రపతిని కలిసిన

## లోకేశ్ బృందం



న్యూఢిల్లీ, (ప్రజా సీమ) ఏప్రిల్ 13 : రాష్ట్రపతి ద్రౌవదీ ముర్ముకు ఏపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

# నెలాఖరులోగా

# డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

- దరఖాస్తు నుంచి అనుమతుల వరకు ఆన్‌లైన్
- కేంద్ర కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ బృందంతో సీఎం సమీక్ష



అమరావతి, (ప్రజా సీమ) ఏప్రిల్ 13 : మే నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకు వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల సులభతరంపై మాట్లాడారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్.. ముఖ్యమంత్రి ఎదుట ఉంచారు. ఈ ప్రతిపాదనలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనల్లో రాష్ట్రం చాలా ముందుందని సందీప్ పౌండ్రిక్ చెప్పగా.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం అవలంబిస్తున్నట్లు వెల్లడించారు. డీ-రెగ్యులేషన్ ఫేజ్-3 చేపడుతున్నారా? అని సందీప్ పౌండ్రిక్‌ను సీఎం అడిగారు. జూన్ నెల

2లో

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

- ఢిల్లీ హైకోర్టులో విచారణ
- దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్



న్యూఢిల్లీ,ఏప్రిల్13 :ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణనుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజ్రీవాల్ స్వయంగా తన వాదనలు వినిపించారు. విచారణ పక్రియలో పక్షపాతం ఉండవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై చేసిన వ్యాఖ్యలు తనను దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని కేజ్రీవాల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థలపై కూడా కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలు మొదట సాక్షులను అరెస్టు చేసి.. ఆ

2లో

## శవరాజకీయాల్లో జగన్ దిట్ట

- తండ్రి చనిపోతే సిఎంకోసం పైరవీలు - మంత్రి అచ్చన్నాయుడు విమర్శలు



అమరావతి, (ప్రజా సీమ) ఏప్రిల్ 13 : శవరాజకీయాలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆనాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించు కున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్ధాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజ మెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

- బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి





లక్నో,(ప్రజా సీమ) ఏప్రిల్ 13 :ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హాపూర్ ప్రాంతంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్పీ జ్ఞానంజయ్ సింగ్ వివరాల ప్రకారం, ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన ట్రక్కును రహదారి నుంచి తొలగించి,

2లో

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రామ్మోహన్



శ్రీకాకుళం,(ప్రజా సీమ) ఏప్రిల్ 13 :శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైంది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని

2లో

ఆస్తిపన్ను బకాయిలపై

## 50శాతం వడ్డీ రాయితీ

- నెలఖారు వరకు గడువు పొడిగింపు

అమరావతి,ఏప్రిల్13(ప్రజా సీమ): పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ గడువును ఈ నెలాఖరు వరకు పొగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి. సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30 వరకు మాత్రమే అమల్లో ఉండనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు

2లో

# సంపాదకీయం

## అంబేడ్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అంబేడ్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితో ద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేడ్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేల మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ గర్వించే విధంగా అమరావతిని ప్రపంచంలోనే ఉత్తమ రాజధానిగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి




భీమడోలు, ఏప్రిల్ 13: ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ గర్వించే విధంగా అమరావతి ని ప్రపంచంలోనే ఉత్తమ రాజధానిగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. భీమడోలులోని కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం పాత్రికేయులతో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను కరువురహితంగా చేసేందుకు పోలవరం ప్రాజెక్ట్ ను వచ్చే ఏడాది నాటికి పూర్తిచేసి, జాతికి అంకితం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. రైతులు ధాన్యం అందించిన 24 నుండి 48 గంటలలోగా వారి అకౌంట్లలో నగదు జమ చేస్తున్నామని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు గోనెసంచులు, రవాణా వంటి ఎటువంటి సమస్యలు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అరాచక పరిస్థితులు సృష్టించి మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రతిపక్షం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యత కలిగిన ప్రతిపక్ష రాజకీయ నేతలు భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తామంటూ అభూతకల్పనలతో అధికారులను, ప్రజలను బెదిరిస్తూ ఉగ్రవాదులుగా ప్రవర్తిస్తూ రాష్ట్రంలో అలజడిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసానికి ప్రజలు గత ఎన్నికలలో 11 సీట్లతో సరిపెట్టారని, ప్రజల తీర్పును అర్థం చేసుకోకుండా, తమ బుద్ధిని మార్చుకోవడంలేదన్నారు. అరాచకాలతో రాష్ట్రంలోనికి పెట్టుబడులు రానీయకుండా ప్రతిపక్ష నాయకులు అడ్డుకుంటున్నారని, అయినప్పటికీ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ఐన ముఖ్యమంత్రి పరిపాలనాదక్షతను చూసిన విదేశీ పెట్టుబడిదారులు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీరామకృష్ణ, వివిధ పార్టీల నాయకులూ, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను బకాయిలపై 50శాతం వడ్డీ రాయితీ

రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.

## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న 12 మందిని గుర్తించగా, ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకుంటున్నాయని అన్నారు. కాగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఏప్రిల్ 6వ తేదీన విచారణ జరిపింది. ఈ సందర్భంగా, కేజ్రీవాల్ సహా పలువురు దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

## నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

నుంచి ఫేజ్-3పై పని చేస్తామని ఆయన తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని సీఎం కోరారు.ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణం విషయంలో రాజీపడొద్దన్నారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. ఫైర్ సేఫ్టీపై నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనల విషయంలో పలు సూచనలు చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు సవరించాలన్నారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని దిశానిర్దేశం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. మే నెలాఖరులోగా డీరెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం పక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతుల ఏర్పాటుకు ఇప్పుడున్న పక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే ఏపీ చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.




## అప్పిలేట్ ట్రిబ్యునల్ సమావేశాలు నిర్వహించి,మమ్మల్ని ఆహ్వానించాలి

### - ట్రిబ్యునల్ జిల్లా కమిటి సభ్యులు డాక్టర్ ఎన్.ముని గోపాలకృష్ణ విజ్ఞప్తి

### - పిజిఆర్ఎస్ నందు జిల్లా కలెక్టరుకి వినతిపత్రం సమర్పణ

మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో అప్పిలేట్ ట్రిబ్యునల్ సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం నిర్వహించి తమను ఆహ్వానించాలని ఏపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,అన్నమయ్య జిల్లా ట్రిబ్యునల్ కమిటి సభ్యులు డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన పిజిఆర్ఎస్ లో జిల్లా కలెక్టరుకి వినతి పత్రం అందజేశారు.అన్నమయ్య జిల్లాలో తనతోపాటు డాక్టర్ మునిరత్నమయ్యను అప్పిలేట్ ట్రిబ్యునల్ లో నియమిస్తూ 2023 - 2026కుగాను సమావేశాలకు హాజరు కావాలని విడుదల చేసిన ఉత్తర్వుల ప్రతిని జిల్లా కలెక్టరుకు అందజేశారు.అప్పిలేట్ ట్రిబ్యునల్ 2023 -2026 సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం జరుపవలసియున్నదని అయితే జరగడం లేదన్నారు.అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలోనైనా మమ్మలను సమావేశాలకు ఆహ్వానించి నిర్వహించ వలసినదిగా జిల్లా కలెక్టరుని కోరడం జరిగిందన్నారు.ఇప్పటి వరకు ఒక్క సమావేశము జరుపలేదని గుర్తుచేస్తూ,అన్నమయ్య జిల్లాకు రైల్వే అసిస్టెంట్ డైరెక్టరును నియమించాలని విజ్ఞప్తి చేశారు.


## పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు విలువ లేదా?



పెనగులూరు (ప్రజా సీమ) : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజవర్గం పెనగలూరు మండలానికి చెందిన ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షేక్ షామీర్ భాష తీవ్ర ఆవేదనతో నిరాహార దీక్షకు కూర్చున్నాడు పార్టీ కష్టకాలంలో పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమం చేస్తూ పార్టీ వెనువెంటనే ఉంటూ కష్టపడి పని చేసిన కార్యకర్తలను ప్రస్తుత ఇంచార్జ్ పట్టించుకోవడంలేదని వైసీపీ నుంచి వచ్చిన వారికే ప్రధాన చేస్తూ వారికే పనులు చేస్తూ వారిని గుర్తిస్తూ పార్టీ కష్ట కాలంలో పనిచేసిన మమ్మల్ని పట్టించుకోవడం లేదంటూ ఆరోపించారు పార్టీలో ఎప్పుడు నుంచో కష్టపడిన మమ్మల్ని పట్టించుకోకుండా మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తూ వైసీపీ నుంచి తమ స్వార్థ ప్రయోజనాల కోసం వచ్చిన వైసీపీ కోవట్లు నీ దగ్గర తీసుకొని వారికే పనులు చేస్తూ వారిని దగ్గర పెట్టుకుని మండలాల్లో వారితోనే కార్యక్రమాలు చేస్తున్నారు తప్ప పార్టీ కష్టకాలంలో కష్టపడి పనిచేసిన ఏ ఒక్క కార్యకర్తను కూడా పట్టించుకోవడంలేదని ఆరోపించారు పార్టీ కష్ట కాలంలో పనిచేసిన కార్యకర్తలకు న్యాయం జరిగే వరకూ తన దీక్ష విరవించబోనని తెలియజేశారు.

## అభయ ఆంజనేయుడికి 8 వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు

రాజంపేట (ప్రజా సీమ) :రాజంపేటలోని వైబియన్ పల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించడం జరిగింది. ఆలయ అర్చకులు అప్పలాచారి రూపిని స్వామి వచ్చిన భక్తులకు వేద ఆశీర్వచనము అందించి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగింది ఉదయం భక్తులందరికీ అల్పాహార విత్తనాలు కూడా చేయడం జరిగింది.



# అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆహ్వానం

## - కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య



పుల్లంపేట ప్రజా సీమ న్యూస్: తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో నేడు భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే కోడూర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్, రక్తదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అంబేద్కర్ అభిమానులు పార్టీలకు, కులమతాలకు అతీతంగా భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శాంతయ్య మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని ప్రపంచంలోని అనేక దేశాలలో జరుపుకోవడం భారతదేశానికి గర్వకారణమని అన్నారు. చరిత్రను రాసేవారు, చదివేవారు ఉంటారని, కానీ చరిత్రను తిరగరాసే మహానుభావుల్లో అంబేద్కర్ ఒకరని కొనియాడారు. న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, ముఖ్యంగా రాజ్యాంగ నిర్మాతగా ఆయన చేసిన సేవలు అమూల్యమని చెప్పారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడిగా అంబేద్కర్‌ను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. నేడు జరిగే జయంతి కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించాలని శాంతయ్య కోరారు.

# సంపూర్ణ మహిళ సాధికారతే దేశ అభివృద్ధికి మూలం

## - బి.టి.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గన్నవరం శ్రీదేవి




మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈరోజు స్త్రీ శక్తి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్దేశాల మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గన్నవరం శ్రీదేవి ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటరుగా డాక్టర్ దేరంగుల శ్రీనివాసులు ఆయనకు సహాయకులుగా మహిళా అధ్యాపకులు బి.కృష్ణవేణి,బి.సాలమ్మలు వ్యవహరించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గన్నవరం శ్రీదేవి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదర్శాల మేరకు దేశ పౌరులందరూ మహిళా సాధికారతకు కట్టుబడి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో విద్యార్థినీ,విద్యార్థులు చురుకైన పాత్ర నిర్వహించి మహిళా సాధికారతపై ప్రభావంతమైన ఉపన్యాసాలు ఇచ్చారు.వక్తలు అందరూ నారీ శక్తి వందన్ అధినియమం-2023 చక్కగా అమలై దేశంలో సంపూర్ణంగా మహిళా సాధికారత సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి,సీనియర్ అధ్యాపకులు డాక్టర్ శైలజ సి.ఎస్,డాక్టర్ జి.చిన్నారెడ్డి,అధ్యాపకులు మరియు పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# వెబ్‌ల్యాండ్ సమస్యలకు పరిష్కారం : రైతులకు ఊరట

## - అన్నదాతలకు పారదర్శకమైన సేవలే లక్ష్యం

## - 1బి పత్రాలు పంపిణీ వేళ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వెల్లడి




మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ వెబ్‌ల్యాండ్ సమస్యలకు జిల్లా యంత్రాంగం వేగంగా పరిష్కారం చూపుతోంది.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా,మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఏళ్లుగా పరిష్కారం కాని వెబ్‌ల్యాండ్ సంబంధిత సమస్యలను పరిష్కరించి,సంబంధిత రైతులకు 1బి (అడంగల్) పత్రాలను మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వెబ్‌ల్యాండ్ సమస్యలు పరిష్కరించిన ఇద్దరు రైతులకు జిల్లా కలెక్టర్ స్వయంగా 1బి పత్రాలను అందజేశారు.గత అనేక సంవత్సరాలుగా సర్వే నెంబర్ సవరణలు,కొత్త సర్వే నంబర్ల చేర్పులు,అడంగల్ వివరాల సరిదిద్దడం వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఈ చర్యల ద్వారా ఊరట లభించింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత పాత రికార్డులు,దస్త్రాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించామని తెలిపారు.ముఖ్యంగా మూడు నుంచి ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.భూమి రికార్డులు సరిగ్గా ఉండటం రైతులకు అత్యంత కీలకమని,పంట రుణాలు,భూమి లావాదేవీలు మరియు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో వెబ్‌ల్యాండ్ రికార్డులు ముఖ్య పాత్ర పోషిస్తాయని కలెక్టర్ వివరించారు.రికార్డుల్లో ఉన్న లోపాలను సరిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే జిల్లా పరిపాలన ప్రధాన లక్ష్యమని తెలిపారు.మిగిలిన దరఖాస్తులను కూడా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని,రెవెన్యూ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,రెవెన్యూ శాఖ అధికారులు,సిబ్బందిరైతులు పాల్గొన్నారు.







# మహిళా రిజర్వేషన్ బిల్లుతో అన్నిరంగాలలో సమానహక్కులు

## - ఈ బిల్లు మహిళా సాధికారతకు భరోసా

## - ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వై.వనజ వెల్లడి

మదనపల్లె (ప్రజా సీమ) : కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ (నారీశక్తి నందన్ అధినీయమ్) బిల్లు అమలులోకి తీసుకురానున్న నేపథ్యంలో ఉన్నత విద్యామండలి కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల నందు సోమవారం స్త్రీ శక్తి పేరిట అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ ఎరికిపాటి వనజ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వనజ మాట్లాడుతూ మహిళల కోసం రాజ్యాంగంలో అనేక చట్టాలు పొందుపరిచారని,తద్వారా మహిళలు అని రంగాలలో రాణిస్తున్నారని కొనియాడారు.అయితే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న (నారీశక్తి నందన్ అధినీయమ్) పథకం మహిళా సాధికారతకు భరోసానిస్తుందన్నారు.ఇది రాజకీయ సమానత్వానికి దోహదపడుతుందన్నారు.2029 సంవత్సరం నుండి ఈ బిల్లు అమలులోకి వస్తుందని వెల్లడించారు.మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు.విపత్కర పరిస్థితుల్లో మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగడానికి ఈ చట్టాలను వినియోగించుకోవాలన్నారు.అనంతరం కో-ఆర్డినేటర్ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు ఉపయోగపడే అనేక పథకాలు,కార్యక్రమాలను రూపొందించాయన్నారు.మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభసూచకమన్నారు.నూతనంగా తీసుకొస్తున్న ఈ చట్టం మహిళలకు ఓ వరమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యాస్మిన్,నాగమణి,బషీర్ అహ్మద్ మరియు విద్యార్థినీలు పాల్గొన్నారు.

# మదనపల్లె డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.పావని

## - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లికి మర్యాదపూర్వక కలయిక

## - పట్టణ ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశం



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బి.పావని సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2023వ బ్యాచ్ లో నేరుగా డీఎస్పీగా ఎంపికైన ఆమెకు ఇదితొలి పోస్టింగ్.బాధ్యతలు స్వీకరించిన అనంతరం,ఆమె మదనపల్లిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీకి పూలమొక్కను అందజేసి విధుల్లో చేరినట్లు నివేదించిన డీఎస్పీకి ఎస్పీ శుభాకాంక్షలు తెలుపుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై దిశానిర్దేశం చేశారు.మదనపల్లె పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్ రద్దీపై ఎస్పీ ప్రత్యేకంగా చర్చించారు.పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని,అక్రమ పార్కింగ్,రహదారుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పించాలని సూచించారు.డీఎస్పీగా తొలి బాధ్యతలే మదనపల్లె వంటి కీలక డివిజన్‌లో రావడం శుభపరిణామమని,శక్తివంచన లేకుండా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు.గంజాయి అక్రమ రవాణా,క్రికెట్ బెట్టింగ్,సైబర్ నేరాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని,మహిళలు,విద్యార్థినుల రక్షణ కోసం గస్తీ పెంచాలని,అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు చెప్పుకునేలా సిబ్బంది పనితీరు ఉండాలని,తక్షణ న్యాయమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.అనంతరం డిఎస్పీ జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం.వెంకటాద్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.డీఎస్పీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె పట్టణ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తానని,శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీపడబోనని ఆమె పేర్కొన్నారు.

# వైభవంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

## - హాజరైన మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్





మదనపల్లె (ప్రజా సీమ) : గంగమ్మ తల్లి చల్లని చూపులతో ప్రజలంతా సుఖసంతోషాలతో తులతుగాలని మదనపల్లె వైయస్సార్సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆకాంక్షించారు.మదనపల్లె మండలం,కొత్తవారిపల్లె మాజీ సర్పంచ్ మహేష్,వైయస్సార్సిపి గ్రామ యువజన విభాగం అధ్యక్షుడు సహదేవ ఆత్మీయ ఆహ్వానం మేరకు సోమవారం కొత్తవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని చిలకవారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి నిస్సార్ అహమ్మద్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా వైయస్సార్సిపి నాయకులు,గ్రామస్థులు నిస్సార్ అహమ్మదుకు ఘనంగా స్వాగతం పలికారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో నిస్సార్ అహమ్మద్ పాల్గొని,గోపూజ కార్యక్రమం నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మికత మరియు శాంతి నెలకొనడానికి ప్రార్థన స్థలాలు,ఆలయాలు ఎంతో దోహదం చేస్తాయనన్నారు.అమ్మవారి కృపాకటాక్ష్యాలతో ప్రజలు సుఖ,సంతోషాలతో తులతుగాలని ఆకాంక్షించారు.ఆలయ నిర్మాణ ప్రదాత సహదేవను అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేష్,రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి విఎస్.రెడ్డి,ధర్మకర్త సహదేవ,గ్రామస్తులు బలరాం,సురేష్,శివ,నరసింహా రెడ్డి,జయరాం,శేఖర్ నాయకులు మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్,గ్రానైట్ మహేష్,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,వడిగల శ్రీకాంత్ రెడ్డి,మాలేపాడు చలపతి,భాను,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతి గ్రామంలో జాతర మహోత్సవంలో పాల్గొన్న కూటమి నేతలు



సిద్ధవటం (ప్రజాసీమ ) :గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో కూటమినేతలు పాల్గొని అమ్మవారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు మండలంలోని జ్యోతి గ్రామంలో వెలసిన ఆదివారం జాతర మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది జాతర తిలకించడానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు తండోప తండాలుగా తరలి రావడంతో రహదారులు కిక్కిరిసిపోయాయి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకున్నారు టిడిపి మండల మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి స్వగృహంలో టిడిపి నేతలకు విందు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసుల రెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ విజయ్ శేఖర్ రెడ్డి, జనసేన పార్లమెంట్ ఇన్చార్జ్, ఎల్లటూరి శ్రీనివాసులు, డిసిసి బి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు , పోలి సుబ్బారెడ్డి, రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ కో-ఆపరేటివ్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, మాజీ కల్లుగీత కార్పొరేషన్ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, సింగిల్ విండో అధ్యక్షులు అధ్యక్షులు దశరథ నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు జగదీష్ కుమార్ రెడ్డి, పార్లమెంట్ మాజీ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జవహర్ భాష, రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, నిత్య పూజ కోన చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ టిడిపి మండల మాజీ కన్వీనర్ సుబ్బారెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ డైరెక్టర్ బాలిరెడ్డి ఒంటిమిట్ట మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్రయ్య, టిడిపి యువనేత ప్రతాప్ నాయుడు, నరసింహారెడ్డి, పిచ్చిరెడ్డి,శేఖర్ రెడ్డి, హరి ప్రసాద్ మాధవరం, మురళి రాయల్, బాలినేని సుబ్బరాజా , సునీల్ రెడ్డి, స్థానిక నాయకులు తదితర మండల కూటమి నేతలు పాల్గొన్నారు

# ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శ


**- మాజీ సర్పంచ్ యోగక్షేమాలపై ఆరా**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామలింగయ్యని పరామర్శించారు. ఆదివారం వేంపల్లెలోని రామలింగయ్య స్వగృహానికి ఎంపి చేరుకుని, యోగక్షేమాలపై ఆరాతీసారు. ధైర్యంగా ఉండాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ అవసరమైన తన దృష్టికి తేవాలని కోరారు. మాజీ సర్పంచ్ రామలింగయ్య విశిష్టమైన సేవలు అందించారని ఎంపి గుర్తు చేశారు.

# నారీ శక్తితో నవభారత నిర్మాణం

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**




వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: నారీశక్తితో నవభారత నిర్మాణానికి మోడీ ప్రభుత్వం కృషి చేస్తోందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో సగభాగమైన మహిళలు, చట్టసభల్లో కీలకపాత్ర పోషించినప్పుడే దేశ, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నారీశక్తి అధినియం ద్వారా మహిళా రిజర్వేషన్లు కల్పించిందన్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ల కలను మోడీ ప్రభుత్వం సాకారం చేస్తోందన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదం చేయనున్నట్లు వెల్లడించారు. దేశాభివృద్ధిలో నారీ శక్తిని అగ్రస్థానం నిలబెట్టడమే, దీని ప్రధాన లక్ష్యమని హర్షం వ్యక్తం చేశారు.

# మిట్స్ యూనివర్సిటీలో అశ్వ - 2కె26 విజయోత్సవ కార్యక్రమం

**- హాజరైన ఛాన్సలర్ ఎన్.విజయ్ భాస్కర్ చౌదరి**






మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు సోమవారం అశ్వ 2కె26- జాతీయస్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం విజయోత్సవ సభ మాత్రమే కాకుండా విద్యార్థి నాయకత్వాన్ని గుర్తించే వేడుక అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ నాయకత్వం,ప్రతిభ సామర్థ్యాలని చాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం లో పాల్గొన్న ప్రతి విద్యార్థి ఒక నాయకుడిగా నిలిచారని,ప్రతి సవాలును ఒక అవకాశంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ప్రతి రంగంలోనూ ఎదగాలని,ఐఐఎం బెంగళూరు,ఐఐటీ తిరుపతి వంటి సంస్థల్లో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించి, ప్లేస్మెంట్ టీమ్లు,స్పోర్ట్స్ టీమ్లు వంటి కార్యకలాపాల్లో రెండవ సంవత్సరం నుంచే చురుకుగా పాల్గొనాలని సూచించారు. మిట్స్ యూనివర్సిటీ అవసరమైన సహకారం,వనరులు అందించేందుకు సిద్ధంగా ఉందని,విద్యార్థులు ముందుకు వచ్చి నాయకత్వాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ నాయకులేనని పేర్కొంటూ,భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కలిసి కట్టుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం,వారి సహకారంతో అందరిని ఉత్సాహపరచడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. టీమ్ స్పిరిట్ అనేది ప్రతి విద్యార్థిలోనూ ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందని ఆయన అన్నారు. అలాగే మిట్స్ యూనివర్సిటీ నందు మ్యూజిక్ మరియు డ్యాన్స్ తరగతులను ప్రారంభించనున్నట్లు ప్రకటిస్తూ,ఆసక్తి ఉన్నవారు తమ రెజ్యూమ్ను రిజిస్ట్రార్కు పంపాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ మార్చ్ 25 మరియు 26 తేదీలలో రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొదటి రోజు రాకాస మూవీ టీం బృందం కొణెదల నిహారిక,హీరో సంగీత్ శోభన్,హీరోయిన్ నయన్ సారిక,గెటప్ శీను,సింగర్స్ సాగర్,మౌనిక యాదవ్,లిప్సిక భాష్యం మరియు రెండవ రోజున హీరో శర్వానంద్,హీరోయిన్ మాళవిక నాయర్,జబర్దస్త్ టీం సద్దాం హుస్సేన్,బిందాస్ భాస్కర్,నవ సందీప్ మరియు జబర్దస్త్ పులిలు పాల్గొని విద్యార్థులను అలరింపజేశారన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ప్రసంశ పత్రాలను మరియు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకనాథ్,రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్,కన్వీనర్ డాక్టర్ కమల్ బాషా,కో-కన్వీనర్ వై.ప్రదీప్ కుమార్,ప్రెసిడెంట్ హర్షవర్ధన్,సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయరాం రెడ్డి,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి

**- ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన**

**- మరిన్ని సేవలందించేందుకు తోడ్పాటు అందిస్తాం**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:ఉత్తమ సమాజ నిర్మాణానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ మండల శాఖ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు లు వెల్లడించారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో మానవత సంస్థ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ప్రముఖ వైద్య నిపుణులు డా.శివకృష్ణ, డా.అపర్ణ లతో పాటు అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులు, వివిధ రకాల సాధారణ వైద్య సేవలతో పాటు కంటి సంబంధిత సమస్యలపై వైద్య సేవలను అందించారు. మానవత సంస్థ ఛైర్మన్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు, మానవత కుటుంబ సభ్యులు, విధ్యార్థి వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశారు. వేంపల్లె మండలం, చూట్టు ఉన్న గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగ పరుచుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి, డా.యోగీశ్వర్ బాబు లు మాట్లాడుతూ గడిచిన కొన్ని దశాబ్దాల కాలం నుంచి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ అనేక రకాల సేవలు అందిస్తున్నామని వివరించారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు దాతలు కూడా ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు కావలి క్రిష్ణతేజ, డాక్టర్ రంగయ్య, డా.రాజారాం, రామమునిరెడ్డి, రాచవీటీ తేజ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# ముదివేడు రిజర్వాయరుకి భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలి

**- రిజర్వాయరుని త్వరగా పూర్తిచేసి రైతులకు మేలుచేయాలి**

**- రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి డిమాండ్**





కురబలకోట (ప్రజా సీమ) : తంబళ్లపల్లి నియోజకవర్గం,కురబలకోట మండలం, ముదివేడు సమీపంలోని పిచ్చిలోల్లపల్లి వద్ద నిర్మించిన రిజర్వాయర్ ను త్వరగా పూర్తిచేసి రైతులకు ఉపయోగపడేలా చూడాలని కిసాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ముదివేడు రిజర్వాయరుని సందర్శించారు. రిజర్వాయర్ మొత్తాన్ని పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సందర్శించి, ఎందుకు పనులు పూర్తి చేయలేదో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి కాకపోవడానికి గల కారణాలను సింగం రామకృష్ణారెడ్డి గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ముదివేడు రిజర్వాయర్పూర్తయితే ఎంతోప్రయోజనం ఉంటుందని చెప్పారు. రిజర్వా యర్ ఆయకట్టు కింద ఏడాదికి రెండు పంటలను సాగు చేసుకునే అవకాశం రైతులకు కలుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వెంటనే ఈ రిజర్వాయర్లు పూర్తి చేసేందుకు కృషి చేయాలని డిమాండ్చేశారు. లేనిపక్షంలోకాంగ్రెస్పార్టీతరఫున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రిజర్వాయరుకి తీసుకున్న భూములకువెంటనే పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ సూచనల మేరకు తాను అన్నమయ్య జిల్లాలో పరిటిస్తూ,రైతులసమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. దేశ ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ అయితే రైతులకు అన్నివిధాలుగా మేలు జరుగుతుందని,కాంగ్రెస్ పార్టీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని సింగం రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు.

# సూర్యలంక బీచ్ వద్ద జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**- అనధికారికంగా టోల్ గేట్ వసూలు చేస్తే కఠిన చర్యలు**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్,ఐ. ఏ.ఎస్**



బాపట్ల, ఏప్రిల్ 13 : సూర్యలంక బీచ్ ప్రాంతంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధికి సంబంధించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సూర్యలంక బీచ్ ప్రాంతాలలో పర్యాటక శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి భూములను ఆర్టీఓ పి.గ్లోరియా, జిల్లా అటవీశాఖ అధికారి రవిశంకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యలంక బీచ్ ప్రాంతంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధికి సంబంధించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు.

# అధ్యాపకులకు అదనపు బాధ్యతలు

## - డైరెక్టర్ కుమారస్వామిగుప్తా



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:ఆర్జియూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న ఆయా విభాగాల్లో అదనపు బాధ్యతలు కల్పించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా వెల్లడించారు. వెంకటేష్ స్టోర్ పర్చేస్ కోఆర్డినేటర్, బాల ఓబయ్య క్యాంపస్ మెయింటనెన్స్ కోఆర్డినేటర్, శరవణ్ సివిల్ వర్క్ కోఆర్డినేటర్, సంతోష్ ఐటి, ఇన్ఫ్రా కోఆర్డినేటర్, నాగరాజు అసోసియేట్ కోఆర్డినేటర్, భాస్కరయ్య లను గెస్ట్ హౌస్ ఇంఛార్జీగా నియమించారు. తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో పని చేయాలని, క్యాంపస్ కీ మంచి పేరు తీసుకురావాలని డైరెక్టర్ తో పాటు ఏఓ డా.రవికుమార్ ఆకాంక్షించారు.

# బీడీ ఆకులు సేకరించే వేలాది కార్మికుల ఉపాధిపై ప్రభావం

## - అటవీ శాఖ అధికారులు వేలం నిర్వహించాలని విజ్ఞప్తి

మదనపల్లె (ప్రజా సీమ) : అటవీ ప్రాంతంలో బీడీ ఆకులు సేకరించి విక్రయించే కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపనుంది.ప్రతి ఏడాది ఏప్రిల్,మే రెండు నెలలు ఉపాధి పొందుతుంటారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ మదనపల్లి డివిజన్ పరిధిలో గత 50 సంవత్సరాలుగా ఈ ఉపాధి ఉండేదని,కాని ఈ సంవత్సరం కొనేవారు లేక ఉపాధి కోల్పోతున్నామని తెలిపారు.డివిజన్ పరిధిలో వేలాది కుటుంబాలు ఉపాధిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.బీడీ ఆకులు కొనేవారికి అటవీ శాఖ వారు వేలంపాట నిర్వహించి,వేలం దక్కించున్న వారి వద్ద నుండి ఆకుల కొనుగోలు చేస్తామన్నారు.కానీ ఈ సంవత్సరశీ వేలం పాట వేయనందున,కొనేవారు లేక బీడీ కార్మికులు ఉపాధి కోల్పోతున్నామని వెల్లడించారు.కావున అటవీశాఖ వారు త్వరగా వేలంపాట నిర్వహించి,ఉపాధి కల్పించాలని చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కార్మికులు పద్మావతి,కల్పన,రెడ్డిమల్లు,నాగవేణి, వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

# వివోఏల మూడు నెలలు వేతనాలు చెల్లించాలి!

## - కనీస వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి ఎమ్మార్వో వినతిపత్రం



రైల్వేకోడూరు (ప్రజా సీమ) : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండలం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో వెలుగు, ఆనిమేటర్లు, వివోఏ లకు, మూడు నెలల , వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం, 26000 ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ , ప్రమోషన్స్,అమలు చేయాలని, రెండు సంవత్సరాల, స్త్రీనిధి, ఇన్సెంటివ్, చెల్లించాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ చెల్లించాలని. 10 లక్షలు వరకువడ్డీ రాయితీ చెల్లించాలని, మొబైల్ సిమ్ములు ఇచ్చినాక, ఎఫ్ ఆర్ ఎస్ శిక్షణ ఇచ్చి అమలు చేయాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన, వివోఏ లకు, నిలిపివేసిన వేతనాలు చెల్లించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు, అరికట్టాలని. పొదుపు సంఘాల, భీమా విధి విధానాలు, బహిర్గతం చేయాలని,డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో సిఐటియు ఆధ్వర్యంలో, మండల తాసిల్దార్, కే అమర్నాథ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సిహెచ్ చంద్రశేఖర్, వివోఏ ల, ఆనిమేటర్లు, యూనియన్, జిల్లా కార్యదర్శి, నగరపాటి ఆనంద్, యూనియన్ నాయకురాలు, నాగవేణి, సోనీ,లక్ష్మీదేవి, రమాదేవి ,చెంచులక్ష్మి, రేవతి, శంకరమ్మ ,కవిత, మహేశ్వరి, సరస్వతి, బుజ్జమ్మ, పద్మా, నందిని ,సుభాషిని,తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్






రైల్వేకోడూరు (ప్రజా సీమ) : రైల్వేకోడూరు విద్యాశాఖ అధికారులు రైల్వేకోడూరులో ప్రాంతంలో విక్టరీస్ ఫ్యూచర్ జెన్ ఇంటర్నేషన్స్ సీబీఎస్సీ స్కూల్ కి ఇటువంటి సంబంధించిన పర్మిషన్ లేదు అని ఎస్ఎఫ్ఐ తరపున పూర్తి వివరాలు ఇవ్వడం జరిగింది. తరువాత ఈ విషయమై తిరుపతి జిల్లా కలెక్టర్ ను కూడా కలిసి మాట్లాడట జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్ తక్షణం స్పందించి ఎటువంటి పర్మిషన్ లేకుండా ఏదైతే బోర్డు వేశారో ఆ బోర్డ్ ను తొలగించాలని తెలియజేయడం జరిగింది. లేనివక్షంలో పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏదైతే పర్మిషన్ లేకుండా బోర్డర్ వేశారు ఆ బోర్డును తొలగించడానికి రైల్వేకోడూరు కమిటీ సిద్ధంగా ఉంది యాజమాన్యం కూడా తెలియజేయడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్,మండల అధ్యక్షులు బాలాజీ, మండల ఉపాధ్యక్షులు విజయ్, వేణుగోపాల్, నాగేంద్ర, మహమ్మద్, బాలు,అభిరామ్, కార్తీక్ పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలు అంటే లెక్క లేదా?

**- రెవిన్యూ అధికారుల ఇస్తారాజ్యానికి అడ్డుకట్ట లేదా? - స్టేటస్ కో ఉన్న ఇష్టారాజ్యంగా రీ సర్వే,,, - ఉద్దేశపూర్వకంగానే రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారన్న బాధితులు - నిబంధనలు ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు పిర్యాదు**





చిట్వేల్,(ప్రజా సీమ) రెవిన్యూ అధికారులు కొందరు వ్యవహరిస్తున్న తీరు బాధితులకు తీవ్ర ఆవేదన కలిగిస్తుంది. ముఖ్యంగా చిట్వేలి మండలంలోని రెవెన్యూ అధికారులు అటు హైకోర్టు ఆదేశాలను, ఇటు బాధితుల గోడును పట్టించుకోకుండా ఏకంగా స్టేటస్ కో ఉన్న భూమిలో రీ సర్వే చేయడం, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అవతల వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలపై బాధితులు తిరుపతి జిల్లా కలెక్టర్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే చిట్వేలి మండలం ఈడిగపల్లి కి చెందిన పొన్నా లక్ష్మీదేవి అధీనంలో ఉన్న సర్వే నంబర్ 1609/9ఖా1 కు సంబంధించిన భూమిపై, పక్క భూమి యజమానులతో వివాదం ఉండగా, లక్ష్మీదేవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు సంబంధిత భూమిపై స్టేటస్ కో ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ విషయం సంబంధిత అధికారులకు మరియు వీఆర్వో కి తెలిసి ఉండగా, మండల రెవెన్యూ అధికారి కూడా కోర్టులో కౌంటర్ దాఖలు చేసినట్లు సమాచారం.అయితే, ఇటువంటి పరిస్థితిలో ఏప్రిల్ 9న సంబంధిత వీఆర్వో , సర్వే నంబర్ 1609/9ఖా1 పై రీ-సర్వే నిర్వహించి తమ ప్రత్యర్థులకు అనుకూలం గా సర్వే చేయడం జరిగిందని బాధితులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అసలు హైకోర్టు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ హైకోర్టు ఆదేశాలను స్పష్టంగా ఉల్లంఘించడం జరిగిందని, అదేవిధంగా, పై రీ-సర్వే నిర్వహణకు ముందు నాకు గానీ, చుట్టుపక్కల భూమి యజమానులకు గానీ ఎటువంటి నోటీస్ ఇవ్వబడలేదనీ, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం అని వీఆర్వో తనకు అనుకూలంగా ఉన్న పక్షాలకు ప్రయోజనం చేకూర్చుటకై ఉద్దేశపూర్వకంగా రీ-సర్వే నిర్వహించినట్లు అనుమానాలు కలుగుతున్నాయని, కావున సదరు అధికారులపై చర్యలు తీసుకొని హైకోర్టు ఆదేశాల ప్రకారం స్టేటస్ కో కొనసాగించి తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 న నిర్వహించిన రీ-సర్వేను తక్షణమే రద్దు చేయవలెననీ, గౌరవ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు




సంబంధిత అధికారులపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవలెననీ, సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసి, పారదర్శకంగా మళ్లీ సర్వే నిర్వహించవలెననీ, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపించవలెననీ, రీ సర్వేను వీఆర్వో తన ఆదాయ వనరుగా మలచుకొని తనకు కావలసిన వారికి అనుకూలం గా చేస్తున్నారనీ, కావున రీ సర్వే నుండి ఇతనిని తొలగించి ఆ స్థానం లో పారదర్శకంగా ఉండే వేరే వారిని నియమించి మాకు మరియు రైతులు కు న్యాయం చేయగలరు అని వారు తెలియజేశారు. మొత్తానికి చిట్వేలి రెవెన్యూ అధికారులు హైకోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా తమకు ఇష్టం వచ్చినట్లు చేస్తూ ప్రభుత్వ విధి విధానాలను తుంగలో తొక్కుతున్నారని స్పష్టంగా అర్థం అవుతుంది. మరి రైతుల గోడు కలెక్టర్ వద్దకు వెళ్లిన మరి చర్యలు ఎలా ఉంటాయో చూడాలి.

# వైసిపి అరాచకాలపై ధీటుగా జవాబు ఇవ్వాలి

## - పార్టీ బలోపేతమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలి
## - రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి దిశా నిర్దేశం







రాజంపేట,(ప్రజా సీమ) :గత వైకాపా ప్రభుత్వంలో వైసిపి నాయకులు పాల్పడిన భూ అక్రమాలను, అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. సోమవారం నాడు స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు రాజంపేట మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైకాపా అరాచకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తలు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని,కార్యకర్తకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన అండగా ఉంటానని చమర్తి హామీ ఇచ్చారు.అంతేకాకుండా రాబోయే రోజుల్లో పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలని పార్టీ శ్రేణులకు జగన్ మోహన్ రాజు సూచించారు. అదేవిధంగా ఈనెల 16వ తేదీన ఉచిత మెగా వైట్ కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు చమర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ,వైస్ చైర్మన్ , పార్లమెంట్ కమిటీ సభ్యులు ,మండల పార్టీ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి,మండల క్లస్టర్ ఇన్చార్జు, యూనిట్ ఇన్చార్జులు ,గ్రామ అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతి రోజు కబ్జానే

**- చోద్యం చూస్తున్న అధికారులు - పరిశీలించడం వదిలేయడం**
**- ఇదే రెవెన్యూ అధికారుల వ్యవహారం**







సిద్ధవటం(ప్రజా సీమ) ప్రతిరోజు పండగే అంటే ఆ కుటుంబం ఎంత సంతోషంగా ఉంటుందో, ప్రతిరోజు కబ్జా జరిగితే కబ్జాదారులకు అంతే సంతోషంగా ఉంటుంది. మరి కబ్జా జరుగుతున్న వారికి ఎటువంటి ఇబ్బందులు లేవంటే ఇక వారికి ఉండే ఆనందం అంతా అంతా కాదు. అలాంటి పరిస్థితి ప్రస్తుతం కడప జిల్లా సిద్ధవటం మండలంలో చోటు చేసుకోవడంతో ఇటీవల కాలంలో భారీగా కబ్జాలు కొనసాగుతున్నాయి. కడప జిల్లా కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న మండలం కావడం, అలాగే జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో ఇక్కడ కబ్జాదారుల పంట పండినట్లు అయింది. మరి కబ్జాదారులు తమకు ఇష్టం వచ్చినట్లు చదువు చేసుకుని తమ పంట పండించుకుని కోట్ల రూపాయల విలువైన భూములను కొల్లగొడుతుంటే కాపాడాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు అంటే మాత్రం చదును చేసి కంచి వేసుకున్న తర్వాత వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటాం అనే ఒక్క మాట చెప్పి అక్కడ నుంచి తప్పించుకుంటున్నారని విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

**నిర్మలగిరి కాలనీలో యదేచ్ఛగా భూ ఆక్రమణ,,**

కోట్లు విలువ చేసే స్థలం కబ్జాదారులు కన్నేశారు. ఇంకేముంది భారీ యంత్రాలతో చదును చేసేశారు. సిద్ధవటం మండలంలోని బొగ్గిడివారి పల్లె గ్రామపంచాయతీ పరిధిలోని నిర్మలగిరి కాలనీలో అక్రమార్కులు భూ అక్రమకు పాల్పడ్డారు. పట్టపగలే యంత్రాలు పెట్టి ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారు. పెద్దపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 870/3 లో మూడు ఎకరాల 50 సెంట్లు మేరకు ప్రభుత్వ భూమి ఉండేది. చాలాకాలంగా ఈ భూమి ఖాళీగా ఉండటంతో అక్రమార్కుల కళ్ళు పడ్డాయి. గతంలో పలుమార్లు స్థానికులు, స్థానికేతరులు, ఈ స్థలాల వద్దకు వచ్చి ముళ్ళ కంచ ఏర్పాటు చేసుకున్నారు. అధికారుల హెచ్చరికలతో వారు సద్దుమణి ఆదివారం సెలవు రోజు కావడంతో అక్రమార్కులు చెలరేగి పోయి యంత్రాలతో చదును చేసి పనులు చేపట్టారు. ఇందులో మాధవరం, బాకరాపేట, మిట్టపల్లి, ఒంటిమిట్ట సిద్ధవటం గ్రామాలకు చెందిన ఒక్కొక్కరూ 10 సెంట్ల నుండి 30 సెంట్ల వరకు హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సమీప గ్రామంలో ఉన్న మిట్టపల్లి వాసులు కొందరు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమార్కులతో వాగ్వాదానికి దిగారు. ఇక్కడ చాలాకాలంగా తమకు స్థలాలు కేటాయించారని ఇప్పుడు వచ్చి స్థలాలు ఎలా ఆక్రమించుకుంటారని ప్రశ్నించారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఈ స్థలాలకు కోట్ల విలువ చేయనున్నాయి. కోట్ల విలువచేసే భూములను బరితెగించి ఆక్రమించుకుంటున్నా రెవిన్యూ అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

**పరిశీలిస్తాం,, చర్యలు తీసుకుంటాం**

నిర్మలగిరి కాలనీలో భూ ఆక్రమాణలకు పాల్పడుతున్నారనే సమాచారం తమ దృష్టికి రావడంతో నివారణ చర్యలు చేపడుతున్నామని తహసిల్దార్ ఆకుల తిరుమల బాబు తెలిపారు. ఆక్రమణకు పాల్పడుతున్న స్థలాన్ని పరిశీలించామన్నారు. సదరు స్థలం వద్ద ఘర్షణ జరిగే అవకాశం ఉండడంతో రెవిన్యూ సిబ్బందిని పంపి నివారణ చర్యలు చేపట్టామన్నారు. సదరు స్థలానికి సంబందించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని ఆక్రమణదారులు చెప్పడంతో సదరు పత్రాలు రెవిన్యూ కార్యాలయానికి తీసుకురావాలని చెప్పడం జరిగిందన్నారు. రెవిన్యూ రికార్డుల్లో ఆయా పత్రాలు నమోదు అయ్యాయా లేదానని పరిశీలించడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

# నేడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**- ఉదయం 9 గంటల కు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోదకుమార్, ఐ. ఏ.ఎస్**

బాపట్ల, ఏప్రిల్ 13 : భారత రాజ్యాంగ నిర్మాత,భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని గడియార స్థంభం సెంటర్, పెద్దానంది పాడు ఫ్లై ఓవర్ దగ్గర ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాలు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతర జిల్లా కలెక్టరేట్ లోని జుజ కాన్ఫరెన్స్ హాల్ 2 నందు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుదన్నారు. అనంతరం డి ఆర్ డి ఏ,బ్యాంకర్స్ ద్వారా ఆస్థులు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, జిల్లాలోని ఎస్ సి,ఎస్టీ,బి సి,మైనార్టీల సంఘాల నాయకులు తదితరులు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# రేపల్లెలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

**స్వయంగా తమ సమస్యలు విన్నవించుకున్న 59 మంది అర్జీదారులు**





బాపట్ల,(ప్రజా సీమ) ఏప్రిల్ 13 : బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ సోమవారం రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రేపల్లె పరిసర ప్రాంతాల నుండి వచ్చిన 28 మంది అర్జీదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ గారికి స్వయంగా విన్నవించుకున్నారు. వారి సమస్యలను క్షుణ్ణంగా విని, అర్జీలను పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరి స్తామని భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 31 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువగా చేసేందుకు ప్రతివారం జిల్లాలోని ఒక్కొక్క నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆనియోజకవర్గ ప్రజల చట్టపరమైన సమస్యలు పరిష్కరించేందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నామని చెప్పారు. ఆ నియోజకవర్గంలో ఉన్న వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దీనితో పాటు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కుటుంబ సమస్యలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర పలు సమస్యలపై రేపల్లె పోలీస్ స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో 28మంది, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 31మంది అర్జీలు అందజేశారని తెలిపారు. వీటినినిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. రేపల్లె డిఎస్పీ ఏ. శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సిలికాన్ వ్యాలీ కి ధీటుగా క్వాంటం వ్యాలీ

**- మార్కుల కోసం కాకుండా జ్ఞానాన్ని పెంపొందించుకోడానికి పోటీ పడండి**

**- తల్లితండ్రులు, విద్య చెప్పిన గురువులకు గౌరవం తీసుకువచ్చేలా తమ క్యారెక్టర్ ను తీర్చిదిద్దుకోవాలి**

**- విద్యతో పాటు నైపుణ్యం శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం - రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి**





ఏలూరు/ భీమడోలు, ఏప్రిల్ 13 : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సిలికాన్ వ్యాలీని ధీటుగా 'క్వాంటం వ్యాలీ ' ని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో నెలకొల్పుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. భీమడోలు లోని సోమవారం జరిగిన శ్రీ మాధురి జూనియర్ కాలేజీ, ఒకేషనల్ కళాశాల 3వ వార్షికోత్సవ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్ గా రూపుదిద్దేందుకు గూగుల్, అసెంచర్,టాటా వంటి దిగ్గజ సంస్థలతో రాష్ట్రంలో 'క్వాంటం వాలీ' టెక్నాలజీ ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారన్నారు. గతంలో ఉన్నత విద్య పేదవారికి అందని ద్రాక్ష వంటిదని, కానీ కూటమి విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. విద్యపై దృష్టి కేంద్రీకరించడం మాత్రమే విద్యార్థుల వంతు అని, వారి ఉన్నత విద్యకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం వారికి అందిస్తుందన్నారు. విద్యతో పాటు యువతకు నైపుణ్యం శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మార్కుల కోసం కాకుండా తమలో జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు కృషిచేయాలన్నారు. విద్యతోపాటు విద్యార్దులు నైతిక ప్రవర్తన నేర్చుకోవాలన్నారు. తమను కన్న తల్లితండ్రులు, విద్య చెప్పిన గురువులకు గౌరవం తీసుకువచ్చేలా తమ క్యారెక్టర్ ను తీర్చిదిద్దుకుని ఉజ్వల భవిష్యత్తు పొందాలన్నారు. చెడు మార్గం ప్రారంభంలో కొంత సంతోషాన్ని ఇచ్చినా, భవిష్యత్తును నాశనం చేస్తుందని, విద్యార్థి దశలో మంచి మార్గంలో వెళితే ఉన్నత స్థానం శాశ్వతంగా వారి స్వంతమవుతుందన్నారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యను అభ్యసించేలా ఒత్తిడి లేని విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ప్రతిభ ఉన్న ఎప్పుడూ అవకాశాలు లభిస్తాయని, విద్యార్థులు తాము కోరుకున్న స్థాయికి చేరాలంటే విద్యార్థి దశలో విద్యపైనే దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ మండలంలో కూడా ఇంటర్నెట్ ప్రొవైడర్స్ ని అభివృద్ధి చేయాలనీ ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యపై దృష్టి పెట్టి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, ప్రతీ విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీరామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కర్రే ప్రేమ్ కుమార్, స్థానిక ప్రముఖులు కె. పెద్దిరాజు, డి.ఎస్. గిరి, పుల్లారావు, ప్రసాద్, రామ్ తులసమ్మ, శాస్త్రి, రాంమూర్తి, కృష్ణకుమారి, ఉమామహేశ్వరరావు, మూర్తి, ప్రభృతులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను మంత్రి పార్థసారథి అందజేశారు.

# ఆరోగ్యం



## ఆరోగ్యంగా ఉండాలంటే ఏ టైంలో తినాలి? ఈ సమయంలో తింటే గుండె సేఫ్!

ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దలు చెబుతుంటారు. ముఖ్యంగా కరోనా తర్వాత అందరికీ ఈ విషయం బాగా అర్థం అయింది. ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకునే ఆహారం మెయిన్. మంచి ఆహారం ద్వారా మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అయితే ఆహారంలో పోషక నాణ్యతతో పాటు, తినే సమయం కూడా చాలా ముఖ్యమైనది. సమయానికి తినకపోతే అనేక ఆరోగ్య సమస్యలను ఏరికోరి కొని తెచ్చుకున్నట్లే. కరెక్ట్ టైంకి ఆహారం తీసుకోకపోతే అది గుండె జబ్బులకు కూడా కారణమవుతుందని ఓ అధ్యయనంలో తేలింది. రోజులో మొదటి,చివరి భోజనం ముందుగానే తినడం వల్ల హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చుంట.

తినడానికి బెస్ట్ టైం ఇదే బార్సిలోనా ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ 103,389 మంది మీద ఫ్రాన్స్ లో ఓ అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనంలో పాల్గొన్నవారు వారి జీవనశైలి, శారీరక శ్రమతో పాటు వారి రోజువారీ ఆహారం, పానీయాల వినియోగం గురించి కూడా వివరించారు. రోజులో మొదటి భోజనం చేసే సమయాన్ని ఆలస్యం చేసే ప్రతి అదనపు గంట %జఎణ% ప్రమాదాన్ని పెంచుతుందని ఈ అధ్యయనం తెలిపింది. చివరి భోజనం సమయంలో ఆలస్యం అయిన ప్రతి అదనపు గంట.. సెరెబ్రోవాస్కులర్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుందని తెలిపింది. రాత్రి 8 గంటల ముందు భోజనం తినడం కంటే రాత్రి 9 తర్వాత చివరి భోజనం ప్రమాదాన్ని 28 శాతం పెంచుతుంది. ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ ని 8 గంటల కంటే ముందు, నైట్ డిన్నర్ ని కూడా 8 గంటల లోపు తినేయడం మంచిదట. ఈ అధ్యయనం ఆధారంగా మొదటి భోజనం సమయంలో స్థిరమైన పద్ధతిని అవలంబించాలి. చాలామంది పొద్దున్నే బ్రేక్ ఫాస్ట్ చేయకుండా డైరక్ట్ గా లంచ్ చేసేస్తుంటారు. అయితే బ్రేక్ ఫాస్ట్ దాటవేయడం కంటే ముందుగానే తినడం మంచిది. చివరి భోజనం, రాత్రి ఉపవాసం వ్యవధిని పెంచడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని డాక్టర్లు సలహా ఇస్తున్నారు.

నైట్ షిఫ్ట్ లో ఇలా రాత్రి షిఫ్టులో పని చేస్తున్నప్పుడు ఎప్పుడు తినాలనేది అనే విషయం గురించి చాలామందిలో గందరగోళం ఉంటుంది. ఆకలి స్థాయిలు ఆహార ఎంపికలను ప్రభావితం చేస్తాయి. షిఫ్ట్ ప్రారంభానికి 2-3 గంటల ముందు సమతుల్య భోజనం తీసుకోవాలని వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. ఈ భోజనంలో కొంత ప్రోటీన్,ఫైబర్ ఉండాలి. ప్రోటీన్, ఫైబర్ సంతృప్తిని అందించడమే కాకుండా మిమ్మల్ని శక్తివంతంగా ఉంచుతాయి.

ఎలా ఆరోగ్యంగా ఉండాలి శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి, కీళ్లను ద్రవపదార్థం చేయడానికి,శరీరం నుండి వ్యర్థ పదార్థాలను బయటకు పంపడానికి పుష్కలంగా ద్రవాలు త్రాగాలి. మలబద్ధకాన్ని నివారించడానికి బాగా హైడ్రేటెడ్ గా ఉండటం కూడా చాలా ముఖ్యం. తక్కువ నీరు త్రాగడం ఏకాగ్రత, చురుకుదనం, స్వల్పకాలిక జ్ఞాపకశక్తిపై ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది.

కెఫిన్

ఈ రోజుల్లో రాత్రి షిఫ్టులలో పనిచేసే వ్యక్తులు కాఫీలు ఎక్కువగా తాగుతుంటారు. కాఫీలో కెఫిన్ ఉంటుంది. ఎక్కువ కెఫిన్ నిద్రపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. నిపుణులు మీ షిఫ్ట్ ముగియడానికి నాలుగు నుండి ఎనిమిది గంటల ముందు కెఫీన్‌కు దూరంగా ఉండాలని సిఫార్సు చేస్తున్నారు. తద్వారా మీరు ఇంటికి వచ్చే సమయానికి కెఫిన్ ప్రభావాలు అరిగిపోతాయి, నిద్రకు అంతరాయం కలిగించవు.

## కందగడ్డ ఫ్రై

కందగడ్డ అనేది దుంప జాతికి చెందిన ఒక కూరగాయ. ఇది మనదేశంలో విస్తృతంగా పండించబడుతుంది. కందగడ్డను అనేక వంటకాల్లో ఉపయోగిస్తారు. కందగడ్డలో అనేక పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. కందగడ్డ.. జీర్ణ సంబంధిత సమస్యలను నివారిస్తుంది,గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది,రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది,బరువు తగ్గడానికి సహాయపడుతుంది,కీళ్ల నొప్పులను తగ్గిస్తుంది,ఎముకలను బలపరుస్తుంది. కందగడ్డను ఎక్కువగా తినడం వల్ల కడుపు నొప్పి లేదా గ్యాస్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మితంగా తీసుకోవడం మంచిది. కందగడ్డ వేపుడు రుచికరమైన వంటకమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలను అందిస్తుంది. కందగడ్డ వేపుడు ఎలా చేసుకోవాలి, దీని తయారీకి ఏమేం పదార్థాలు కావాలో ఇక్కడ చూడండి.



కందగడ్డ వేపుడు తయారీకి కావాల్సిన పదార్థాలు -కందగడ్డ - 500 గ్రాములు -నూనె - వేయించడానికి సరిపడా -ఉప్పు - రుచికి సరిపడా -పసుపు - 1/2 టీ స్పూన్ -కారం - 1 టీ స్పూన్ -ధనియాల పొడి - 1 టీ స్పూన్ -జీలకర్ర పొడి - 1/2 టీ స్పూన్ -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీ స్పూన్ -కరివేపాకు - కొన్ని రెమ్మలు కందగడ్డ వేపుడు తయారీ విధానం -ముందుగా కందగడ్డను శుభ్రంగా కడిగి, తొక్క తీసి, చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. -కట్ చేసిన ముక్కలను ఒక గిన్నెలో వేసి అందులో ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. -స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో కందగడ్డ ముక్కలు మరియు కొద్దిగా నీరు వేసి 2-3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. -ఉడికించిన ముక్కలను నీటిని వడగట్టి చల్లారనివ్వాలి. -ఒక పాన్‌లో నూనె వేసి వేడి చేయాలి. -వేడి నూనెలో కరివేపాకు వేసి వేయించాలి. -తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. -ఇప్పుడు ఉడికించిన కందగడ్డ ముక్కలు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. -ముక్కలు బంగారు రంగు వచ్చే వరకు వేయించి స్టవ్ ఆఫ్ చేసేయండి. -వేడి వేడి కందగడ్డ వేపుడు రెడీ. కందగడ్డ వేపుడులో రకాలు కందగడ్డ వేపుడును వివిధ రకాలుగా తయారు చేయవచ్చు. కొన్ని ప్రసిద్ధ రకాలు ఇక్కడ చూడండి. మసాలా కందగడ్డ వేపుడు.. ఇందులో వివిధ మసాలాలు ఉపయోగిస్తారు. పెరుగు కందగడ్డ వేపుడు..ఇందులో పెరుగు ఉపయోగిస్తారు. వేరుశెనగ కందగడ్డ వేపుడు..ఇందులో వేరుశెనగలు ఉపయోగిస్తారు.

తెలుగు వంటలు

## హెూటల్ స్టైల్ 'పొడి ఇడ్లీ' ఇంట్లోనే..



మసాలా ఇడ్లీ, తవా ఇడ్లీ, కారం ఇడ్లీ, ఘీ ఇడ్లీ ఇలా ఎన్నో రకాల ఇడ్లీలు తినే ఉంటారు. కానీ ఎప్పుడైనా హెూటల్ స్టైల్‌లో పొడి ఇడ్లీ ఎప్పుడైనా తిన్నారా? మిగిలిపోయిన ఇడ్లీలతో చేసే ఈ పొడి ఇడ్లీ రుచి అమోఘంగా ఉంటుంది. ఒక్కసారి వాటిపై కొంచెం నెయ్యి తగిలించి తింటే ఆ రుచి ఇంకా వేరే లెవెల్ అని చెప్పుకోవచ్చు. ఇది చదువుతుంటేనే నోట్లో నీళ్లు ఊరుతున్నాయి కదూ. అయితే ఈ ఇడ్లీని ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

పొడి ఇడ్లీ చేయడానికి కావలసిన పదార్థాలు: మిగిలిపోయిన ఇడ్లీలు (చిన్న ముక్కలుగా కోసినవి) నూనె ఆవాలు మినపప్పు కరివేపాకు పప్పుల పొడి (ధాల్, చనాలు మొదలైనవి) సన్నగా తరిగిన కొత్తిమీర రుచికి తగినంత ఉప్పు రుచికి తగినంత కారం

తయారీ విధానం: ముందుగా ఒక పాన్‌ను స్టవ్‌పైన పెట్టుకోవాలి. ఆ పాన్ వేడెక్కిన తరువాత దానిపై నూనె పోసుకోవాలి. నూనె వేడయ్యాక దానిపై ఆవాలు వేసుకోవాలి. ఆ తరువాత మినపప్పు, కరివేపాకులు కూడా వేసుకొని కాసేపు వేయించుకోవాలి. ఇప్పుడు చిన్న చిన్న ముక్కలుగా కోసుకొని పెట్టుకున్న ఇడ్లీలు వేసుకోవాలి. ఇడ్లీలు బాగా ఫ్రై అయ్యాక.. ఆ ఇడ్లీల ఫ్రైతో పప్పుల పొడి, రుచికి తగినంత కారం, రుచికి తగినంత ఉప్పు వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత దానిలో సన్నగా తరిగిన కొత్తిమీర వేసుకుంటే పొడి ఇడ్లీ సిద్ధమైనట్లే. వీటిని ఓ ప్లేట్‌లో సర్వ్ చేసుకుంటే ఎంతో రుచికరమైన పొడి ఇడ్లీ సిద్ధమైనట్లే. దీనిపై ఒక్క చుక్క నెయ్యి వేసుకొని తింటే.. నా సామిరంగా నాలుక లాపలపలాడాల్సిందే.

## బరువు తగ్గడంలో గేమ్ ఛేంజర్..' బీట్ రూట్ సలాడ్' ఇలా చేసుకోండి





అలియా భట్ బాలీవుడ్ లో ప్రముఖ హీరోయిన్. అందం, అద్భుత నటనతో మెప్పించే అలియా భట్ శాఖాహారి. అయితే నాన్ వెజ్ ని కొంతకాలం తిని మానేయడం లా కాకుండా చిన్నతనం నుంచే పూర్తిగా శాఖాహారిగా ఉంది. ఓ ఇంటర్వ్యూలో అలియా మాట్లాడుతూ..తాను జంతు ప్రేమికురాలినని, తనకు జంతువులను చంపి తినడం ఇష్టం లేదని చెప్పింది. వెజిటేరియన్ డైట్ ఆరోగ్యకరమైనదని, పర్యావరణానికి మంచిదని తాను నమ్ముతానని అలియా చెప్పారు.

అలియా భట్ కు ఇష్టమైన ఫుడ్ బీట్ రూట్ సలాడ్. బీట్‌రూట్ తక్కువ కేలరీలు,పోషకాలను కలిగి ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది, ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా ఇది బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది. బీట్ రూట్ సలాడ్ ని మీరు కూడా మీ ఇంట్లో తయారు చేయాలనుకుంటున్నారా? అయితే దీని తయారీకి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ చూడండి.

బీట్ రూట్ సలాడ్ తయారీకి కావాల్సిన పదార్థాలు -1 బీట్‌రూట్ (ఉడికించి తురిమినది) -1 కప్పు పెరుగు -బ్లాక్ పెప్పర్ -1 టీస్పూన్ చాట్ మసాలా -చిటికెడు కొత్తిమీర తరుగు. -1/4 టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ -ఆవాలు -జీలకర్ర -ఇంగువ -కరివేపాకు బీట్‌రూట్ సలాడ్ తయారీ విధానం -ముందుగా బీట్ రూట్ పైన చెక్కు తీసేసి దాన్ని తరుముకోవాలి. అందులో పెరుగు వేసి బాగా కలపండి. ఇందులోనే బ్లాక్ పెప్పర్, చాట్ మసాలా, కొత్తిమీర తరుగు, ఉప్పు వేసి చెంచాతో కలపాలి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి ఆయిల్ వేసి ఆవాలు,జీలకర్ర వేడి చేయాలి. వేడిని తగ్గించి ఇంగువ వేసి, తర్వాత కరివేపాకు వేసి కలపాలి. -ఇప్పుడు పాన్‌లోని ఈ మొత్తం ఈ మిశ్రమాన్ని పెరుగు,బీట్ రూట్ మిశ్రమంలో వేయండి. మళ్లీ బాగా కలపాలి. బీట్‌రూట్ సలాడ్ రెడీ.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కోసం చరణ్ తన రూపాన్ని పూర్తిగా మార్చేశారు. పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో పక్కా మాస్ అవతారంలో కనిపిస్తున్న చరణ్, తాజాగా ఒక ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీపై మెరిశారు. ఎస్క్వైర్ ఇండియా ఏప్రిల్ 2026 ఎడిషన్ కోసం ఆయన చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కవర్ పేజీపై చరణ్ కనిపిస్తున్న తీరు చూస్తుంటే ఆయన గ్లోబల్ స్టార్ ఇమేజ్‌కు ఇది పర్ఫెక్ట్ లుక్ అనిపిస్తోంది. ఈ ఫోటోలో చరణ్ స్టైలింగ్ చాలా డిఫరెంట్ గా ఉంది. డార్క్ బ్లూ కలర్ సూట్ ధరించి, కళ్ళజోడు పెట్టుకుని చాలా ఇంటెన్స్ గా కనిపిస్తున్నారు. 'పెద్ది' సినిమాలోని రగ్గడ్ లుక్ కు, ఈ అల్ట్రా మోడరన్ స్టైలిష్ లుక్ తోడవ్వడంతో అభిమానులు థ్రిల్ అవుతున్నారు. ఒక పక్కా లోకల్ మాస్ కథలో నటిస్తూనే, ఇలాంటి ఇంటర్నేషనల్ మ్యాగజైన్స్ పై తన మార్క్ చూపిస్తున్నారు. ఫోటో బ్యాక్‌గ్రౌండ్‌లో చైనీస్ అక్షరాలతో ఉన్న బోర్డులు కనిపిస్తుండటం చూస్తుంటే, ఇది ఏదైనా ఫారిన్ లొకేషన్‌లో లేదా ఒక ప్రత్యేకమైన సెట్‌లో తీసినట్లు అర్థమవుతోంది. అయితే ఈ ఫోటోలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో విషయం చరణ్ చేతిలో ఉన్న ఒక చిన్న కుక్క పిల్ల. రామ్ చరణ్‌కు తన పెంపుడు కుక్క 'రైమ్' అంటే ఎంత ప్రాణమో అందరికీ తెలిసిందే. ఆయన ఎక్కడికి వెళ్లినా రైమ్ తోడుగా ఉంటుంది. కానీ ఈ ఫోటోలో ఉన్న కుక్క పిల్ల నల్లటి రంగులో ఉండటంతో, ఇది రైమేనా లేక కొత్తగా తీసుకున్నారా అనే

## పెద్ది లుక్కుతో చరణ్ స్టైలిష్ స్వాగ్!



సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నలుపు రంగులో ఉన్న ఆ డాగ్ ను చరణ్ చాలా ప్రేమగా పట్టుకుని ఉండటం ఈ ఫోటోకు ఒక కొత్త ఫీల్ తీసుకొచ్చింది. చరణ్ తన కెరీర్ లో ఎప్పుడూ లేనంతగా ఈ 'పెద్ది' సినిమా కోసం ఫిజికల్ గా చాలా కష్టపడుతున్నారు. సినిమా షూటింగ్ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. జూన్ నెలలో విడుదల చేసేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ గ్యాప్ లో చరణ్ ఇలాంటి ఫోటోషూట్లతో వార్తల్లో నిలుస్తూ సినిమాపై హైప్ పెంచుతున్నారు. ఈ మ్యాగజైన్ షూట్ కోసం ఉపయోగించిన కలర్ ప్యాలెట్ లైటింగ్ చరణ్ లుక్ ను మరింత ఎలివేట్ చేశాయి. చేతిలో ఒక చిన్న పూల బొకే పట్టుకుని, స్టైలిష్ గా నడుస్తూ వస్తున్న స్టిల్ ఇప్పుడు మెగా ఫ్యాన్స్ కు ఫుల్ మీల్స్ లాంటిది. ఒకవైపు 'పెద్ది' లోని ఊర మాస్ గెటప్, మరోవైపు ఈ క్లాస్ అండ్ స్టైలిష్ గెటప్.. చరణ్ లోని వర్సటాలిటీని చాటిచెబుతున్నాయి. ఈ ఫోటో చూసిన వాళ్లంతా చరణ్ లోని ఇంటెన్సిటీని మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. ముఖ్యంగా ఆయన జుట్టు గడ్డం స్టైలింగ్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది.



## ఫస్ట్ ఇండియన్ స్టార్... ప్రభాస్ హీరోయిన్‌కి రేర్ రికార్డ్











స్టార్స్ నుంచి చిన్న సెలబ్రిటీల వరకు ఈ మధ్య కాలంలో అందరూ ఏదో ఒక బ్రాండ్‌కు అంబాసిడర్‌గా వ్యవహరించడం మనం చూస్తూ ఉంటాం. కొన్ని బ్రాండ్స్‌కి అంబాడిసర్‌గా వ్యవహరించాలని కొందరు స్టార్స్ కోరుకుంటారు. ఆ బ్రాండ్స్‌కి అంబాసిడర్‌గా వ్యవహరిస్తే తమకు మరింత గుర్తింపు, గౌరవం లభిస్తుంది అనుకునే వారు కూడా చాలా మంది ఉంటారు. అలా హాలీవుడ్ నుంచి అన్ని వుడ్స్ ముద్దుగుమ్మలు కోరుకునేది విక్టోరియాస్ సీక్రెట్ బ్రాండ్. ఈ కంపెనీ ఇన్నర్స్, నైట్ వేర్‌తో పాటు బ్యూటీ ప్రొడక్ట్స్‌ను సెల్ చేస్తూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ బ్రాండ్‌కి మార్కెట్ ఉంది. అందుకే ఈ కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా చేస్తే ప్రపంచం మొత్తం చూస్తుంది. అందుకే ఈ కంపెనీ కోసం బ్రాండింగ్ చేయాలని ఎంతో మంది కోరుకుంటూ ఉంటారు. ఇండియన్ స్టార్స్‌కి ఈ అవకాశం ఇప్పటి వరకు రాలేదు. విక్టోరియా సీక్రెట్ బ్రాండ్ అంబాసిడర్‌గా... ఎట్టకేలకు విక్టోరియా సీక్రెట్ బ్రాండ్‌కి ఇండియన్ స్టార్ సెలబ్రిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక అయ్యింది. బాలీవుడ్ నుంచి ప్రియాంక చోప్రా, దీపికా పదుకునే, ఆలియా భట్ వంటి ఎంతో మంది సీనియర్ అండ్ స్టార్ బ్యూటీస్ ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే కెరీర్ ను ఆరంభిస్తున్న హాట్ బ్యూటీ త్రిప్తి డిమ్రికి ఆ ఛాన్స్ దక్కింది. గతంలో ఒకరు ఇద్దరు హీరోయిన్స్ ఇన్నర్స్ బ్రాండ్‌కి అంబాసిడర్‌గా వ్యవహరించేందుకు ఆసక్తి చూపించలేదనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఆ తర్వాత హీరోయిన్స్ చాలా మంది ఆ బ్రాండ్‌కి అంబాసిడర్‌గా వ్యవహరించాలని కోరుకున్నారు. కానీ ఏ ఒక్కరికి ఆ ఛాన్స్ రాలేదు. కానీ అనూహ్యంగా త్రిప్తి డిమ్రికి ఆ ఛాన్స్ రావడం ప్రతి ఒక్క బాలీవుడ్ సెలెబ్రిటీని ఆశ్చర్యంలో ముంచింది అంటూ ఒక మీడియా సంస్థ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం జరిగింది. ఇండస్ట్రీలో ఈ అమ్మడు అడుగు పెట్టి చాలా ఏళ్లు అయింది. కానీ యానిమల్ సినిమాలో కనిపించే వరకు ఈమెను జనాలు గుర్తించలేదు. సందీప్ వంగ తన యానిమల్ సినిమాతో ఈమెకు లైఫ్ ఇచ్చాడు. ఆ సినిమాలో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్నతో పోల్చితే ఈమెకే ఎక్కువ గుర్తింపు దక్కింది. ఆ గుర్తింపుతోనే ఏడాదిలోనే ఏకంగా అరడజను సినిమాలు చేసింది. ఇప్పుడు మళ్లీ సందీప్ వంగ దర్శకత్వంలోనే సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ప్రభాస్ హీరోగా సందీప్ వంగ దర్శకత్వంలో రూపొందుతున్న స్పిరిట్ సినిమాలో త్రిప్తి డిమ్రిని హీరోయిన్‌గా ఎంపిక చేశారు. అంతకు ముందు ఈ సినిమా కోసం హీరోయిన్‌గా దీపికా పదుకునేను ఎంపిక చేయడం జరిగింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ స్థానంలో త్రిప్తి డిమ్రి వచ్చి చేరింది. స్పిరిట్ సినిమాతో త్రిప్తి పాన్ ఇండియా స్టార్ హీరోయిన్‌గా మారబోతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## 'డెకాయిట్' మృణాల్.. నాగ్ అశ్విన్ సలహా వెనుక రీజనేంటి?





టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్, బీటౌన్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ మధ్య ఉన్న అనుబంధం స్పెషల్ అనే చెప్పాలి. సీతారామం సినిమా ద్వారా ఆ ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడగా.. నాగవంశీ హోం బ్యాన్ వైజయంతీ మూవీస్ బ్యానర్ పై వచ్చిన ఆ చిత్రంతోనే మృణాల్ తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. అప్పటి నుంచి నాగ్ అశ్విన్ ఆమె టాలెంట్ ను దగ్గరగా గమనిస్తూ వస్తున్నారు. అంతే కాదు తన మూవీ కల్కి 2898 ఏడీ మూవీలో గెస్ట్ రోల్ ఇచ్చారు.

అయితే ఇటీవల విడుదలై మంచి విజయాన్ని సాధించిన డెకాయిట్ సినిమా సక్సెస్ మీట్ లో నాగ్, మృణాల్ అనుబంధం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగ్ అశ్విన్, మృణాల్ నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆమెను సాధారణ నటిగా కాకుండా, లెజెండరీ స్థాయి నటీమణులతో పోల్చారు. "మృణాల్ అద్భుతమైన నటి. ఆమెలో ఒక ప్రత్యేకమైన గ్రేస్ ఉంది. గతంలో ప్రేక్షకులను అలరించిన స్మితా పాటిల్, మధుబాల లాంటి నటీమణుల తరహా లక్షణాలు ఆమెలో కనిపిస్తున్నాయి. అలాంటి నటీమణులు చాలా అరుదుగా ఉంటారు" అంటూ నాగ్ అశ్విన్ కొనియాడారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్.. సోషల్ మీడియాతోపాటు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. అయితే కేవలం ప్రశంసలతోనే ఆగకుండా మృణాల్ కెరీర్ పై ఒక విలువైన సలహా కూడా ఇచ్చారు. "నువ్వు చాలా గొప్ప స్థాయి ఉన్న నటివి. కాబట్టి చిన్న చిన్న పాత్రలు లేదా ప్రాధాన్యత లేని క్యారెక్టర్లు చేసి నీ స్థాయిని తగ్గించుకోవద్దు. ఎప్పటికీ గుర్తుండిపోయే గొప్ప పాత్రలను మాత్రమే ఎంచుకోవాలి" అని సూచించారు. ఒక స్టార్ డైరెక్టర్ ఈ విధంగా ఓ హీరోయిన్ భవిష్యత్తుపై శ్రద్ధ చూపడం విశేషం. ప్రస్తుతం మృణాల్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. సీతారామం తర్వాత కథల ఎంపికలో ఆమె జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. హాయ్ నాన్న వంటి సినిమాలతో కూడా ఆమె తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు. తాజాగా డెకాయిట్ చిత్రంలో అడివి శేష్ సరసన నటించి మరో విజయాన్ని అందుకున్నారు. మృణాల్ భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలను ఎంచుకుంటే, ఆమె కెరీర్ మరో స్థాయికి చేరుతుందని చెప్పాలి. అయితే నాగ్ అశ్విన్– మృణాల్ ఠాకూర్ అనుబంధం నుంచి వచ్చిన ఆ సజెషన్.. ఆమె కెరీర్ కు కొత్త దిశను చూపించనుందనే చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా కొనసాగుతోంది. అదే సమయంలో టాలీవుడ్ లోకి వచ్చి నుంచి మృణాల్ ఠాకూర్ టాలెంట్ ను గమనిస్తున్నారు కాబట్టే.. అంత మంచిగా కేర్ తీసుకుని నాగ్ అశ్విన్ సలహా ఇచ్చినట్లు ఉన్నారని నెటిజన్లు, సినీ ప్రియులు కామెంట్లు పెడుతున్నారు.

## అడివి శేష్ 'డెకాయిట్'.. ఇదే ఊపు కంటిన్యూ చేస్తే..

టాలీవుడ్ లో వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తనకయా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యంగ్ హీరో అడివి శేష్ నటించిన తాజా చిత్రం డెకాయిట్ బాక్సాఫీస్ వద్ద మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ప్రేక్షకుల్లోనే కాకుండా ఇండస్ట్రీ వర్గాల్లో కూడా ఆ సినిమాపై విడుదల ముందే మంచి అంచనాలు నెలకొన్నాయి. వాటిని ఆ చిత్రం అందుకున్నట్లు కనిపిస్తోంది. ఆ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, హీరోయిన్ గా క్రేజీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ నటించారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ షానీల్ డియో ఆ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం విశేషం. విడుదలకు ముందే టీజర్, ట్రైలర్, అలాగే రుబారు, చిచ్చుబుడ్డి పాటలు ప్రేక్షకులను ఆకట్టుకుని సినిమాపై మంచి హైప్ తీసుకొచ్చాయి. అయితే విడుదలైన మొదటి రోజున సినిమాకు కొంత మిక్స్ టాక్ వచ్చినప్పటికీ, ఓపెనింగ్స్ మాత్రం స్ట్రాంగ్ గా నమోదయ్యాయి. తర్వాత రోజుల్లో పాజిటివ్ టాక్ స్ప్రెడ్ అవుతూ రావడంతో కలెక్షన్లు కూడా మెరుగయ్యాయి. ముఖ్యంగా వీకెండ్ లో సినిమా మంచి రన్ ను సాధించింది. మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఆ చిత్రం రూ.40 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. సుమారు రూ.65 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఆ చిత్రం విడుదలకు ముందే డిజిటల్, శాటిలైట్ హక్కుల ద్వారా



దాదాపు రూ.48 కోట్లు రాబట్టింది. దీంతో థియేట్రికల్ గా కేవలం రూ.17 కోట్లు వస్తే సరిపోతుందనే సేఫ్ జోన్ లోకి చేరింది. ఇప్పటికే మూడు రోజుల్లోనే ఆ టార్గెట్ ను దాటేసి బ్రేక్ ఈవెన్ సాధించడం గమనార్హం. దీంతో డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇక ఇప్పుడు వీక్ డేస్ ప్రారంభం కావడంతో డెకాయిట్ చిత్రం ఎలాంటి వసూళ్లు సాధిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ లేకపోవడం సినిమాకు ప్లస్ గా మారింది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma